



ప్రవేశాలు అక్కడ తరగతులు ఇక్కడ!

- జిల్లాకేంద్రంలో ఎడ్యుకేషన్ హబ్ పేరిట అడ్డగోలు దందా
- అసలు తరగతులకు వెళ్లకుండానే పాస్ గ్యారెంటీ
- ఐఐటీ, ఎన్ఐటీ ర్యాంకులతో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు
- తల్లిదండ్రుల అమాయకత్వాన్ని సొమ్ముచేసుకుంటున్నా నిర్వాహకులు
- క్షేత్రస్థాయిలో ఇంటర్మీడియట్ అధికారుల పర్యవేక్షణ కరువు

ఆదిలాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ విధానంలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లను నిర్వహిస్తూ అడ్డగోలుగా దండుకుంటున్నారు. విచిత్రం ఏమిటంటే జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థుల అడ్మిషన్లు ఒకచోట.. తరగతులను మరోచోట నిర్వహించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కార్పొరేట్ స్థాయిలో ఉన్నత విద్య అవకాశాలను కల్పిస్తామంటూ భారీస్థాయిలో ప్రచారంప్రకటనలు చేసుకుంటు ఇన్స్టిట్యూషన్లను నిర్వహించడం పరిపాటిగానే మారుతోంది. కొద్దిరోజుల క్రితం జిల్లా కేంద్రంలోని ద్వారకనగర్ కాలనీ పెట్రోల్‌బంక్ సమీపంలో ఓ ఎడ్యుకేషన్ హబ్‌ను ఏర్పాటుచేసి అడ్డదారిలో ఇంటర్మీడియట్ తరగతులను నిర్వహించడం విమర్శలకు దారి తీస్తోంది. ఎలాంటి అనుమతులు లేకపోయినా ట్యూషన్ పేరిట ఇంటర్మీడియట్ విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తున్న సంబంధిత శాఖ అధికారులు నోరు మెదుపకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదేమని అధికారులను ప్రశ్నించగా తల్లిదండ్రులు ఫిర్యాదుచేస్తేనే తనిఖీలు చేస్తామంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇస్తూ దాటవేస్తున్నారు.

ప్రైవేట్ కాలేజీలతో కుమ్మక్కు

ఉట్నూర్ మండల కేంద్రంతో పాటు జిల్లాకేంద్రంలోని పలు ప్రైవేట్ ఇంటర్మీడియట్ కాలేజీలతో హబ్ నిర్వాహకులు కుమ్మకవుతు అడ్డదారిలో ఇన్‌స్టిట్యూషన్‌లను నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అసలు నిబంధనల ప్రకారం ఇంటర్మీడియట్‌లో విద్యార్థుల హాజరు 75శాతం ఉంటేనే వార్షిక పరీక్షలకు అనుమతిస్తారు. అలాగే కొన్ని సందర్భాల్లో విద్యార్థులు అనారోగ్య భారీన పడి తరగతులకు హాజరుకాక పోతే అలాంటి పరిస్థితుల్లో 10శాతం వెసులుబాటును కల్పిస్తారు. అంటే తప్పనిసరిగా 65 శాతం హాజరు ఉంటేనే విద్యార్థులు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు రాయాల్సి ఉంటుంది. కానీ జిల్లాకేంద్రంలోని ఎడ్యుకేషన్ హబ్‌లో దీనికి భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. ఒక్కరోజు కూడా తరగతులకు హాజరుకాక పోయిన యథేచ్ఛగా వార్షిక పరీక్షలను నిర్వహించడం ఏమిటో ఇంటర్మీడియట్ అధికారులకే తెలియాలి. ఆపైగా వందశాతం ఇంటర్ పాస్ గ్యారెంటీ అని నిర్వాహకులు భుకాయిస్తున్న అధికారులు చోద్యం చూస్తున్నారు.



జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయం

ఒక్కో అడ్మిషన్‌కు రూ.10వేలు

ప్రైవేట్ కాలేజీలతో రహస్యంగా ఒప్పందం చేసుకుంటున్న నిర్వాహకులు ఒక్కో విద్యార్థి అడ్మిషన్‌కు రూ.10వేలను చెల్లిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఉట్నూర్ మండలకేంద్రంలోని పలు ప్రైవేట్ ఇంటర్మీడియట్ కాలేజీల్లో విద్యార్థుల అడ్మిషన్లు చేస్తూ ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ద్వారకానగర్‌లో తరగతులను నిర్వహిస్తున్నారు. ఇదంతా నిబంధనలకు విరుద్ధమే అయినప్పటికీ సంబంధితశాఖ అధికారులు సైలెంట్‌గానే కనిపిస్తున్నారు. ఎక్కడ ప్రైవేట్ కాలేజీని ఏర్పాటుచేస్తే అక్కడే విద్యార్థులు చదువులను కొనసాగించాల్సి ఉంటుంది. గుర్తింపు పొందిన కాలేజీని ఇతరచోటకు మార్చుతున్నట్లయితే ఇంటర్మీడియట్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ ఇలాంటి నిబంధనలు ఎక్కడ పాటించినట్లు కనిపించడం లేదు. ఏజెన్సీలో అంతంత మాత్రంగానే కొనసాగుతున్న పలు ప్రైవేట్ కాలేజీ యజమాన్యాలు ఎడ్యుకేషన్ హబ్‌లతో కుమ్మకై అడ్డదారిలో అడ్మిషన్లు ఇస్తూ అందినకాడికి దండుకుంటున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

అడ్డగోలుగా ఫీజులు

ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, నీట్‌లపై మోజుపడుతున్న తల్లిదండ్రుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న కొన్ని ప్రైవేట్ ఇన్స్టిట్యూషన్స్ విచ్చలవిడిగా ఫీజుల వసూలుకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఫీజులపై ఎలాంటి నియంత్రణ లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రంగా నష్టపోతున్నారు. మెరుగైన వసతులు, అనుభవజ్ఞులైన లెక్చరర్స్ పేరిటా ర్యాంకులతో ఎర వేస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రంలోని (మిగతా 6వపేజీలో..)

అడ్మిషన్ తీసుకున్న చోటే తరగతులకు హాజరు కావాలి

• జాదవ్ గణేష్ కుమార్
(జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, ఆదిలాబాద్)



ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్న చోటే తరగతులకు హాజరుకావాల్సి ఉంటుంది. ఒక చోట అడ్మిషన్ తీసుకుని మరోచోట చదువుకోవడం సాధ్యపడదు. తప్పనిసరిగా హాజరుశాతం ఉంటేనే పరీక్షలు రాయాల్సి ఉంటుంది. లేకపోతే వార్షిక పరీక్షలకు అనుమతి ఉండదు. జిల్లాకేంద్రంలోని ఓ హబ్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్మీడియట్ తరగతులను నిర్వహిస్తున్న విషయం దృష్టికి రాలేదు. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

నార్నూర్ బ్లాక్ అభివృద్ధికి జాతీయస్థాయిలో గుర్తింపు

• భువనేశ్వర్ సదస్సుకు కలెక్టర్ రాజార్షిషా



నార్నూర్ బ్లాక్ అభివృద్ధిని వివరిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్, జూలై17 (ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి గాను ప్రధానమంత్రి అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అవార్డును అందుకున్న విషయం తెలిసిందే. గురువారం కలెక్టర్ రాజార్షిషా ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌లో రెండు రోజులపాటు నిర్వహించనున్న ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రామ్‌లో నార్నూర్ బ్లాక్ అభివృద్ధి, సాధించిన ప్రగతి అనుభవాలను వివిధ రాష్ట్రాల అధికారులతో కలిసి పంచుకున్నారు. ఇందులో భాగంగా సంసద్‌టీవీలో ప్రసారమయ్యే ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమం అభినవ పహల్ 3.0 సీరిస్‌కు ఆదిలాబాద్ కలెక్టర్ హాజరై మాట్లాడారు. నార్నూర్ బ్లాక్‌లో అమలవుతున్న ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం(ఏబీపీ)లో సాధించిన ప్రగతిని వివరించారు. ఆరోగ్యం, విద్యా, వ్యవసాయం, పోషణ, మౌలిక వసతులు, సామాజిక అభివృద్ధి వంటి ప్రధానరంగాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఇప్పటికే గణనీయమైన పురోగతిని సాధించామని ప్రధానంగా గిరిజనులు, పేద, మధ్యతరగతి ప్రజలకు అన్ని వసతులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న దుర్వ నగేష్

బోరజ్ తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

• రాష్ట్ర పర్ధాన్ సమాజ్ అధ్యక్షుడు దుర్వ నగేష్

ఆదిలాబాద్, జూలై17 (ఆంధ్రజ్యోతి): బోరజ్ మండల తహసీల్దార్ రాజేశ్వరిని సస్పెండ్ చేయాలని రాష్ట్ర పర్ధాన్ అధ్యక్షుడు దుర్వనగేష్ డిమాండ్ చేశాడు. గురువారం ఆయన మాట్లాడుతూ హత్తిఘాట్ గ్రామానికి చెందిన గిరిజన ఆదివాసీ రైతు గేడం అంబాబాయి సంబంధించిన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారన్నారు. దీనిపై హైకోర్టులో స్టే ఉండగా అక్రమంగా సర్వే నెంబర్ 41, 42/2 విస్తీర్ణం 25 ఎకరాల 26గుంటల భూమిని అవినీతికి పాల్పడి వినోద్‌కుమార్ అగర్వాల్ అనే వ్యక్తికి ఇటీవలే పట్టా ఇవ్వడం ఇచ్చారాన్నరు. హైకోర్టు ఉత్తర్వులను సైతం ధిక్కరించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

అతివలకు అండగా సఖీ కేంద్రం సేవలు

• ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆపత్కాలంలో ఉన్న అతివలకు అండగా ఉండాలని సఖీ కేంద్రం సిబ్బందికి ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. పట్టణంలోని సఖీ కేంద్రాన్ని గురువారం ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్‌తో కలిసి ఆయన సందర్శించారు. కేంద్రం ద్వారా మహిళలకు అందుతున్న సేవలపై సమీక్షించారు. మహిళలు ఎటువంటి ఆపదలో అయినా సఖీ కేంద్రాన్ని సంప్రిస్తే వైద్యం, వసతి సదుపాయాలు లభిస్తాయని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. కుటుంబ కలహాలను కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరిస్తారని పేర్కొనారు. ప్రజలు అత్యవసర సమయాల్లో డయల్ 100 లేదా సఖి కేంద్రం కోసం 181 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ సునీల్‌కుమార్, సఖి సెంటర్ సిబ్బంది లావణ్య, సంఘమిత్ర, అక్షయ్, నాగమణి పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా కష్టపడాలి

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ప్రణాళిక ప్రకారం సంసిద్ధం కావాలని, తల్లితండ్రుల కలలను సాకారం చేస్తూ వారు గర్వించే స్థాయికి ఎదగాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఐఐటీ అడ్వాన్స్ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంకులు సాధించిన పోలీసుల పిల్లలను ఎస్పీ అభినందించారు. స్థానిక పోలీసు ముఖ్యకార్యాలయంలో ఐఐటీ అడ్వాన్స్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చౌహాన్ కార్తీక్, రాథోడ్ లావణ్య, రాథోడ్ గోవర్ధన్‌ను సత్కరించి ఒక్కొక్కరికి రూ.10 వేలు బహుమతిగా అందేసి ప్రోత్సహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సులోచన, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచల వెంకటేశ్వర్లు, సీసీ కొండరాజు, ప్రజాఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్‌కవిత, వామన్ ఉన్నారు.

నిరుద్యోగులను మోసగించిన కృష్ణను అరెస్టు చేయాలి: బీజేపీ

ఉట్నూర్, జూలై17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులకు ఆశలు చూపెట్టి మైక్రోఫైనాన్స్ ఉద్యోగాలు ఇస్తామని రూ.కోట్లు దండుకొని పరారైన డిజిటల్ మైక్రో ఫైనాన్స్ చైర్మన్ కృష్ణను వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ డిమాండ్‌చేశారు. ఉట్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంతోపాటు ఉట్నూర్, జైనూర్లలో డిజిటల్ మైక్రోఫైనాన్స్ కార్యాలయాలు ఏర్పాటుచేసుకుని మేనేజర్లు, డైరెక్టర్లు, క్లర్కులు లాంటి ఉద్యోగాలు ఇస్తామంటూ నిరుద్యోగుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేయడంతో పాటు కొంత మంది ఉద్యోగుల నుంచి కూడా భారీగా డబ్బులు వసూలు చేసి ప్రజలను, నిరుద్యోగులను మోసగించిన కృష్ణపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అమాయక గిరిజన నిరుద్యోగులను మోసం చేయడానికి వలసవాదులు వస్తున్నారని సేవపేరుతో దోపిడీలకు పాల్పడుతున్న వారి పట్ల అధికార యంత్రాంగం కఠినచర్యలు తీసుకోవాలని అన్నారు. రూ.4 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు వసూళ్లకు పాల్పడి పరారైన చైర్మన్ కృష్ణపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జాతీయ నాయకులు శ్రీరామ్‌నాయక్, మాజీ జడ్పీటీసీ సాదిగే గంగన్న, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, సీపతి లింగాగౌడ్, అడిగే రాజేశ్వర్, శ్రీనివాస్, బానోత్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు వినని అధికారి మాకెందుకు?

• ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తీరుపై ఆదివాసుల ఆగ్రహం • కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామంటూ ఆందోళన



మంచిర్యాల ఉట్నూర్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న నాయకులు



ఆందోళన విరమించాలని సర్దిచెప్తున్న పోలీసులు

ఉట్నూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నించాల్సిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా గిరిజనులతో చర్చించడానికి అవకాశం కల్పించడం లేదని పేర్కొంటూ ఆదివాసీ సంఘాల నాయకులు ప్రాజెక్టు అధికారిపై ఆగ్రహించారు. గురువారం ఉట్నూర్ మండలకేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయంలో ఆదివాసీ సంఘాల నాయకులు వివిధ సమస్యలపై పీఓతో చర్చించడానికి రావడంతో గంట పాటు నిరీక్షించిన అనంతరం తమను పిలిపించుకున్న ప్రాజెక్టు అధికారి తమ సమస్యలు వినడం లేదని మండిపడ్డారు. సీఆర్టీల నియామకంలో ఏ జిల్లాలో ఎన్ని ఖాళీలు ఉన్నాయో నోటిఫికేషన్‌లో ప్రకటించలేదని, బుధవారం జరిపిన సీఆర్టీల డెమో సరిగ్గా జరగలేదని, డీడీ కార్యాలయంలో కొంత మంది ఉ ద్యోగులు దీర్ఘకాలంగా ఉన్నారని వారిని తొలగించాలని చెబుతుండగా పీవో ఆదేశాలతో వీడియోలు తీయిస్తూ ఉండడంతో తాము అభ్యంతరం చెప్పామన్నారు. తాను వీడియోలు తీయిస్తానని, మీరు అవసరం అనుకుంటే సమస్యలు చెప్పొచ్చని పీవో పేర్కొనడంపై ఆదివాసీ నిరుద్యోగ యువకులు పీవో వైఖరిని నిరసిస్తూ రోడ్డుపై భైఠాయించారని తుడందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడంగణేష్ ఉమ్మడి జిల్లాఅధ్యక్షుడు పురకబాపు రావులు తెలిపారు. దీంతో సీఐ మడవి ప్రసాద్, ఎస్సై ప్రవీణ్ పోలీసులతో చేరుకొని రోడ్డుపై భైఠాయించిన ఆదివాసీ నాయకులను రాస్తారోకో విరమించేలా తొలగించారు. దీనిపై గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు దేవేందర్, మేస్రం శేఖర్‌లు మాట్లాడుతూ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి కానీ గిరిజనుల సమస్యలు వినే ఓపిక లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. పీవో వైఖరిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, పీవో తీరుమార్చుకోకపోతే నిరంతరం ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుడందెబ్బ, ఆదివాసీ విద్యార్థి సంఘం, ఏజెన్సీ డీఎస్సీ సాధన సమితి, ఆదివాసీ విద్యార్థి సంఘం, ఏజెన్సీ డీఎస్సీ సాధన సమితి ఆదివాసీ గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



దేశీ దారుతో నిందితుడు

దేశీదారు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

భీంపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అక్రమ దేశీదారు మద్యం సీసాలను మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రెండ్ల విజేందర్ తెలిపారు. భీంపూర్ మండలం వడ్దూరు గ్రామానికి చెందిన అగ్గు దాను, గేడం విఠల్‌లు మహారాష్ట్ర నుంచి రూ.4,500 విలువ గల 56 దేశీదారు మద్యం సీసాలను గ్రామంలో విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై వెంకటేశ్వర్, సిబ్బంది, తానాజీ, నానాంగ్ సింగ్, ధనరాజ్, లత పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖలో సీఆర్టీల నియామకానికి దరఖాస్తులు

ఉట్నూర్, జూలై17(ఆంధ్రజ్యోతి):ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో స్పెషల్ గ్రేడ్‌టీచర్ల పోస్టులలో కాంట్రాక్ట్ రెసిడెన్సి టీచర్ల (సీఆర్టీ) నియామకం కోసం అర్హులైన గిరిజన నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్టీల నియామకంలో స్థానిక గిరిజన అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తామని, అలాగే బాలికల పాఠశాలలో మహిళల ఉపాధ్యాయులను మాత్రమే నియమిస్తామని పేర్కొన్నారు. 1 నుంచి 7వ తరగతి వరకు నాలుగేళ్ల పాటు ఏ జిల్లాలో చదివితే ఆ జిల్లాలోని స్థానికంగా గుర్తిస్తామని తెలిపారు. ఇంటర్మీడియట్, డీఎడ్, టెట్ 1వ పేపర్ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 18 నుంచి 23 వరకు 5గంటల వరకు స్వీకరిస్తామని, రాత పరీక్ష 25న నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తిగల గిరిజన నిరుద్యోగులు జిల్లా గిరిజన సంక్షేమ అధికారుల కార్యాలయాల్లోదరఖాస్తులు సమర్పించుకోవాలని తెలిపారు.

ప్రథమ చికిత్సపై పోలీసు సిబ్బందికి శిక్షణ



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఆదిలాబాద్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆపత్కాల సమయాల్లో ముందుగా చేరుకొని విధులు నిర్వర్తించే పోలీసులకు ప్రథమచికిత్సలపై పూర్తి అవగాహన కల్పించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఇందుకు బ్లూకోర్ట్, డయల్ హండ్రెడ్ సిబ్బందికి రెండు విడతలగా ప్రథమ చికిత్స గురించి శిక్షణను అందించనుండగా గురువారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో శిక్షణను ప్రారంభించారు. ఐదుగురు నిష్ణాతులైన వైద్యులతో ప్రథమ చికిత్సకు సంబంధించిన అంశాలపై శిక్షణ అందించనున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఎలాంటి అత్యవసర సమయంలోనైనా పోలీసులు ముందుండి ఘటన స్థలాలకు చేరుకుంటారని, అక్కడ ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ఆపేశక్తి సిబ్బందికి ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగానే ప్రథమ చికిత్సలపై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సీపీఆర్ ఏ సమయంలో చేయాలి.. ఎలా చేయాలి.. ఎంత సమయం వరకు చేయాలి అనే అంశాలపై డాక్టర్లతో డెమో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ షాక్, పాము కాటు బాధితులకు, అగ్ని ప్రమాదంలో గాయపడిన వారికి అందించే ప్రథమ చికిత్సలపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఈ అవకాశాన్ని పోలీసు సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఏఆర్ డీఎస్పీ ఇంద్ర వర్ధన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రణయ్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మురళీ పాల్గొన్నారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్‌ను కలిసిన మాజీ ఎంపీ



రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్‌తో మాజీ ఎంపీ

నేరడిగొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ కార్యాలయంలో డైరెక్టర్ రవీందర్ నాయక్‌ను గురువారం మాజీ ఎంపీ సోయం బాపూరావు కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వర్షకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో గిరిజనులు, గిరిజనేతరులందరికీ మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి చేయాలని డైరెక్టర్‌ను కోరగా సానుకూలంగా స్పందించి ఆదిలాబాద్ వైద్య ఆరోగ్య శాఖకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్టు మాజీ ఎంపీ సోయం బాపూరావు తెలిపారు.

మండల అభివృద్ధి కోసం కృషి చేయాలి

• ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవో

నేరడిగొండ, జూలై17 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధి కోసం కృషి చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం ఎంపీడీవో శేఖర్ బాధ్యతలు చేపట్టి తొలిసారిగా ఎమ్మెల్యే అనిల్ యాదవ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం కృషిచేయాలని తనవంతు సాయం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇందులో నేరడిగొండ పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డిలు ఉన్నారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్ నియామకంపై అభ్యంతరాలు

ఆదిలాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య నియామకంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది మైనార్టీ నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తరతరాలుగా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని పనిచేస్తున్న నామినెట్ పదవుల్లో మైనార్టీలకు అవకాశం కల్పించడం లేదని పేర్కొంటున్నారు. ఏనాడు బోథ్ నియోజకవర్గంలో పార్టీ గెలుపుకోసం పనిచేయని నేతకు గ్రంథాలయ చైర్మన్ పదవిని కేటాయించడంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు సమీఉల్లాఖాన్, షేక్ రాజ్‌మహమ్మద్, షేక్ అజీమ్, సైద్‌అజీమ్, మహమ్మద్‌ఆలీ, షేక్ నదీం, షేక్ హబీబ్ ప్రకటనలో తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేసిన సీఐ



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ

బోథ్, జూలై17 (ఆంధ్రజ్యోతి): బోథ్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం సాయంత్రం స్థానిక సీఐ వెంకటేశ్వర్‌రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి ఎస్సై శ్రీసాయికి పలు సూచనలు చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైకి పలు సూచనలు చేశారు. శాంతిభద్రతలపై దృష్టిసారించాలని, గంజాయి సాగుపై తగు దృష్టి పెట్టాలన్నారు.

దివ్యాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

ఆదిలాబాద్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు పెండింగ్ పెన్షన్‌లను మంజూరు చేయడంతో పాటు కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు ఎం.నగేష్ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తమ డిమాండ్లను వెల్లడిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎన్.పీ.ఆర్.డీ జిల్లా అధ్యక్షులు నగేష్ మాట్లాడుతూ... చేయూత పెన్షన్‌ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 24 లక్షల పైచిలుకు మంది దివ్యాంగులు దరఖాస్తులు చేసుకున్నారని, పెండింగ్ పెన్షన్లు మంజూరు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ధర్నాలో పోచన్న, అనసూయ, ప్రియాంక, హరిఫా బేగం పాల్గొన్నారు.

'విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన అవసరం'

ఉట్నూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని దంతంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాంబాబు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాదవ్‌రమేష్, హెల్త్ సూపర్‌వైజర్ నూర్‌సింగ్, వైద్య సిబ్బంది మారుతి, గౌడని, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే శ్రమదానం

ఉట్నూర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని వార్దాలో ఉన్నసేవాగ్రాం మహాత్మాగాంధీ ఆశ్రమంలో ఖానాపూర్ నియోజక వర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ నాలుగు రోజుల క్యాంపులో భాగంగా గురువారం గోశాలలో శ్రమదానం నిర్వహించారు. పరిసరాల చుట్టు ఉన్న చెత్తను తొలగించారు. అనంతరం మధ్యాహ్నం భోజన సమయంలో పర్యాటకులకు ఎమ్మెల్యే స్వయంగా భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర సంగ్రామానికి సేవాగ్రాం ఆశ్రమం ఊపిరి పోసిందన్నారు. ఆయనతో తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకొరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సేవారత్న కాథలే మారుతికి సన్మానం

ఉట్నూర్, జూలై17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కళామందిర్ ఫౌండేషన్ ద్వారా ఉత్తమసేవలకు గాను సేవారత్న పురస్కారం అందుకున్న ఆదివాసీ గిరిజనుడు కాథలే మారుతిని గురువారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా సన్మానించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఆదిలాబాద్ మండలం చించుఘాట్‌కి చెందిన కాథలే మారుతి ఎంతో మంది గిరిజన బాల బాలికలకువిలు విద్యలో శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలో ఎదిగేలా కృషి చేయడం అభినందనీయం అన్నారు.గ్రామాల్లోని సమస్యలు పరిష్కారంలోను ఆయన చొరవను గుర్తించి రూపాయలు లక్ష నగదు జ్ఞాపికను కళామందిర్ ఫౌండేషన్ అందించిదని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో (పీవీటీజీ) మేస్రం మనోహర్, ఏసీఎంఓ ఆత్రంజగన్, జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి'

జైనథ్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని తద్వారానే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని డీఆర్డీఏ/ఐకేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వకుల సూచించారు. గురువారం జైనథ్ మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ పాఠశాల, మోడల్ స్కూల్లో చదువుతున్న బాలికలకు ముహువ (ఇప్పపువ్వు)లడ్డులను అంద జేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా బాలికలు యుక్త వయస్సు నుండే ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు.వ్యక్తిగత పరిశ్రుభతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు. ఇందులో శ్రీనిధి ఆర్ఎం పూర్ణ చందర్‌రావు, ఏపీఎం భగవండ్లు, కేజీబీవీ ప్రిన్సిపల్ వీణాకుమారి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రాము, పాఠశాల కమిటీ చైర్మన్ గంగామణి తదితరులున్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్

ఆదిలాబాద్‌రరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న జాదవ్ సంగీతకు డాక్టరేట్ పట్టా పొందారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో తెలంగాణ విశ్వ విద్యాలయం పీహెచ్‌డీ మొదటి బ్యాచ్‌లో సీటు పొందిన ఆమె ప్రొఫెసర్ లావణ్య పర్యవేక్షణలో ఆదిలాబాద్ గిరిజనుల సంస్కృతి, మౌళిక సాహిత్యం అనే అంశం పై పరిశోధన చేశారు. ప్రిన్సిపల్‌కు డాక్టరేట్ లభించడం పై కళాశాల గెస్ట్ లెక్చరర్స్ సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాహుల్, కోశాధికారి ఆనంద్, నవీన్, విజయ్, నందకుమార్, సలెహా, ఆఫర్, గెస్ట్ లెక్చరర్స్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

నేరడిగొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండలంలోని క్యాంప్ కార్యాలయంలో నేరడిగొండ మండలంలోని లింగట్ల గ్రామానికి చెందిన సాబ్లే దేవుబాయికి రూ. 22,500, బజార్హత్నూర్ మండలంలోని దేగామ గ్రామానికి చెందిన తీగల కవితకు రూ. 19 వేల సీఎం సహాయ నిధి మంజూరైన చెక్కులను అందజేశారు. ఆయన వెంట నేరడిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆడే వసంతరావు, మండల యూత్ అధ్యక్షులు హీరాసింగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, తొడసం శంకర్, పోతారెడ్డి, నారాయణ, దేవన్న, రమేష్ యాదవ్, మౌలానా, యువ నాయకులు ఎం.డి.సద్దాం తదితరులు ఉన్నారు.

వీధి దీపాల నిర్వహణ పట్టదా ?

ఇచ్చోడ, జులై, 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని టీచర్స్ కాలనీలో పలు వీధి దీపాలు నెలలుగా నిరంతరాయంగా వెలుగుతున్నాయి. నిర్వహణ లేకపోవడంతో అందులోని కొన్ని లైట్లు వెలగడంలేదు. దీపాలు వెలగని ప్రాంతంలో దీపాలు ఏర్పాటుచేసి, నిరంతరం వెలిగె దీపాలకు నిర్వహణ చేపట్టి విద్యుత్తు వృథాను అరికట్టాలి. ఈ విషయమై అధికారుల కార్యాలయాలకు వెళ్లి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఈ రోజు రేపు అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప ఇటువైపు కన్నెత్తి చూడడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరం

బోథ్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చట్టాలపైన విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగించినట్లయితే భవిష్యత్తులో తప్పులు చేయకుండా ఉంటారని న్యాయవాది కుమ్మరి విజయకుమార్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో న్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, రిటైర్డ్ ఎంఈఓ కుమ్మరి పోశెట్టి, అధ్యాపకులు ప్రవీణ్ రెడ్డితో పాటు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సోనాల ఆసుపత్రి వద్ద మందుబాబు వీరంగం

బోథ్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గురువారం ఓ వ్యక్తి చిత్తుగా మద్యం తాగి నానా హంగామా సృష్టించారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి మద్యం మత్తులో కర్ర చేత పట్టుకుని తిప్పుతూ బూతులు తిడుతూ అటు ఇటు తిరగడంతో భయభ్రాంతులకు గురైన వారు వైద్య సిబ్బంది 100 డైల్ చేయడంతో పోలీసులు వచ్చి మద్యం మత్తులో ఉన్న వ్యక్తికి నచ్చజెప్పి అక్కడి నుండి పంపించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, జూలై17 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి మెకానిక్ వృత్తిన అడ్డుగా ఉంచుకుని చోరీలు చేస్తున్న ముఠాను జైనథ్ పోలీసులు అరెస్టు చేశారని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం జిల్లా ఎస్పీ జైనథ్ పోలీసు స్టేషన్‌కు సందర్శించిన సందర్భంగా పత్రిక ప్రకటన ద్వారా వివరాలు వెల్లడించారు. బేల మండలానికి చెందిన మెకానిక్ ఏ1 సుమిత్, వారి మిత్రులు మైనర్ సలీం షకీల్‌లతో కలిసి మహారాష్ట్రకు చెందిన కృష్ణతో గ్యాంగ్‌గా ఏర్పడి ఆదిలాబాద్‌వన్‌టౌన్, బేల, జైనథ్ కొర్భణ మండలాల్లో దొంగతనాలు చేస్తూ, వాహనాలకు ఇంజన్లు మారుస్తూ ఇతరులకు అమ్ముతు నేరాలకు పాల్పడ్డారని తెలిపారు. నిందితులందరిని జైనథ్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అదేవిధంగా నిందితుల వద్ద నుంచి వాహనాలను కొనుగోలు చేసిన వారిపై కూడా కేసులు నమోదు చేశారని, మొత్తం 12 వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. నిందితులు ఏ1 సుమిత్‌సకర్కర్ (మెకానిక్), ఏ2 మైనర్ బేల, ఏ3 కృష్ణతా న్యానఖతే (కూలీ), సలీం (అరెస్టు చేయాల్సి ఉంది), ఏ5 షేక్ షకీల్ (డ్రైవర్)లను అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే దొంగ వాహనాలను కొన్న ఏ6 అబ్రార్‌ఖాన్ (స్క్రాప్ వ్యాపారం), ఏ7 షేక్ ఇబ్రహీంహాజీమియా (స్క్రాప్‌వాహనం), ఏ8 సాయి (మెకా నిక్) లను కూడా అరెస్టు చేశామన్నారు. పోలీసులు మొత్తం 12 మోటర్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ కేసులు ఏ1, ఏ3, ఏ5 నిందితులను



స్వాధీనం చేసుకున్న బైక్‌లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపారన్నారు. మైనర్‌ను జువెనైల్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు. ఏ2, ఏ6, ఏ7, ఏ8 నిందితులకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు జారీ చేశామని తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచన జ ఐనథ్ సీఐ డి.సాయినాథ్, ఎస్సై గౌతమ్, సిబ్బంది వికాస్, నరేష్‌లను ప్రత్యే కంగా అభినందించారు.

ఒకేరోజు మూడిళ్లలో చోరీ

ఇచ్చోడ, జులై, 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బుధవారం రాత్రి మూడు ఇళ్లల్లో దొంగలు పడి బంగారు, వెండి, నగదును దొంగలించినట్లు పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్న జాదవ్ వనితాబాయి భర్త జాదవ్ దేవిదాస్ ఈనెల 14వ తేదీన పురుగులమందు సేవించి మృతిచెందాడు. వారి స్వగ్రామమైన ఘన్‌పూర్‌లో అంత్యక్రియలు నిర్వహించెందుకు వెళ్లిన కుటుంబసభ్యులు ఇళ్లకు తాళం వేసి వెళ్లారు. గమనించిన దొంగలు ఆ ఇంట్లోకి దూరి 8గ్రాముల బంగారపు చెవికమ్మలు, 4 గ్రాముల పుస్తెలె, 20 తులాల వెండి గజ్జలు, 8 వేల నగదును దొంగలించారు. అలాగే సమీపంలో ఉన్న పంచాల రమేష్ ఇంట్లో చొరబడ్డ దొంగలు 4గ్రాముల చెవికమ్మలు, నగదు, చిక్రం జంగు ఇంట్లో 6గ్రాముల బుట్టకమ్మలు, 4గ్రాముల మాటీలు, 5తులాల వెండి కడియాలు, ఆనంద్‌రావ్ ఇంట్లో 20గ్రాముల బంగారం, 12వేల నగదు దొంగలించిట్లు పోలీసులు పేర్కొన్నారు. మూడు ఇళ్లల్లో కలిపి మొత్తం 26 గ్రాముల బంగారం, 25 తులాల వెండి దొంగలించారు. అర్ధరాత్రి సమయంలో విద్యానగర్ కాలనీలో అనుమానాస్పదంగా తిరగుతున్న ముగ్గురు వ్యక్తుల చిత్రాలు సీసీ



చిందరవందరగా పడేసి ఉన్న వస్తువులు

కెమెరాకు చిక్కాయి. చోరీ జరిగిన కాలనీల్లో ఆ సమయంలో అనుమానాస్పదంగా తిరిగిన వ్యక్తుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి దర్యాప్తును కొనసాగిస్తున్నామని ఎస్సై పురుషోత్తం తెలిపారు.

జల్సాల కోసం చోరీలు

● ముఠా అరెస్టు

● ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్‌టౌన్/లక్ష్మణచాంద, జూలై17 (ఆంధ్రజ్యోతి): వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను నిర్మల్ జిల్లా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. నిర్మల్‌లోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం మహారాష్ట్రలోని ఉమ్రికి చెందిన రాజు సింగ్, మోహన్ సింగ్, భవారి సేవక్ సింగ్, రఫ్ బీర్ సింగ్, సుర్దీప్ సింగ్ జూనిలు బంధువులు. వీరు మద్యానికి, జల్సాలకు అలవాటుపడ్డారు. కూలీ పని చేసుకుంటూ జీవించేవారు. జల్సాలకు డబ్బులు సరిపోక చోరీలు చేసి సులభంగా డబ్బులు సంపాదించాలని భావించి అందరూ కలిసి వేసుకున్న పథకం ప్రకారం ఈ నెల 12వ తేదీ రోజున రాత్రి 9 గంటలకు మోటార్ సైకిల్ ఎంహెచ్ 26-బీఆర్ 9554పై ఉమ్రి నుంచి భైంసా మీదుగా నిర్మల్‌కు వచ్చారు. కొండాపూర్ మీదుగా నేరుగా కనకాపూర్ గ్రామానికి చేరుకున్నారు. అక్కడ పెట్రోల్ పంప్ దగ్గరలో ఒక ఇంటి ముందు మోటార్ సైకిల్ టీఎస్ 18- 7614 కనిపించగా దానిని దొంగిలించారు. అదే ఊర్లో గల బస్టాండ్ ఏరియాకి రాగా అక్కడ ఒక గోల్డ్ షాప్ కనిపించింది. ఈ గోల్డ్ షాప్ షట్టర్‌ను పైకి లేపి షాప్‌లో గల బంగారు, వెండి ఆభరణాలను దొంగతనం చేశారు. మరలా అదే రోజు రాత్రి వారు మోటార్‌సైకిల్‌పై ఉమ్రికి వెళ్తుండగా మార్గ మధ్యలో కుంటాల మండలం కల్లూర్ గ్రామం లో బస్టాండ్ సమీపంలో బైక్‌లు ఆపి వారి దగ్గర ఉన్న ఇనుప రాడ్ సహాయంతో రెండు దుకాణాల షట్టర్ తాళాలు పగులగొట్టి అట్టి షాప్ కౌంటర్‌లలో ఒక దుకాణంలో 1000 రూపాయలు, మరొక దుకాణంలో 1500ల రూపాయలను దొంగతనం చేసి అదే రోజు రాత్రి ఉమ్రికి వెళ్లారు. ఈ వరుస దొంగతనం కేసులలో ఎలాగైనా నేరస్తులను త్వరగా పట్టుకోవాలనే ఉద్దేశ్యంతో సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి నేతృత్వంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని ఆమె అన్నారు. నిందితులైన రాజు సింగ్,మోహన్ సింగ్, భవారి సేవక్ సింగ్, రఫ్ బీర్ సింగ్, సుర్దీప్ సింగ్ జూనిలు వారు దొంగిలించిన సొత్తును నిర్మల్‌లోని గాంధీచౌక్‌లోని ఓ దుకాణంలో అమ్మడానికి రాగా అప్పటికే నమ్మదగిన సమాచారంతో అక్కడ వేచి ఉన్న పోలీసుల ప్రత్యేక బృందాన్ని చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. వారి దగ్గర సుమారు 2.7 కేజీల వెండి, 17 గ్రాముల బంగారం, 1 మోటార్ సైకిల్‌ను స్వాధీనపరుచుకున్నారు. కేసులో ఉత్తమ ప్రతిభ కనబరిచి నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి, లక్ష్మణచాంద ఎస్సై జి. శ్రీనివాస్, పీసీఆర్ ఎస్సై ప్రదీప్ కుమార్, మామడ ఎస్సై అశోక్, సిబ్బంది సందీప్, ప్రమోద్, జగన్ సింగ్, తిరుపతి, సుభాష్, సతీష్ రెడ్డి, సంతోష్, కిరణ్, గణేష్, వినోద్‌లను నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

'బాసర అభివృద్ధిపై ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు'

భైంసా, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి క్షేత్ర గర్భగుడి అభివృద్ధిపై ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి విలాస్ గాదేవార్ అక్షేపించారు. గురువారం భైంసాలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల బాసరలో రాష్ట్ర మంత్రుల జరిపిన పర్యటనలో పాల్గొన్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం బాసర అమ్మవారి క్షేత్ర గర్భగుడి అభివృద్ధికి నిధులు కేటాయించని పక్షంలో బిక్షాటన చేసి పనులు పూర్తి చేయిస్తానని పేర్కొనడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఇందులో బీఆర్ఎస్ జిల్లా ప్రతినిధులు నంగి రాజేష్, నిమ్మ సురేష్, సాయినాథ్ పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



పోలింగ్ బూత్ వద్ద ఓటు వేసేందుకు క్యూలో నిలుచున్న విద్యార్థులు

నేరడిగొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వడూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఈవీఎంపై ఓటింగ్ విధానం, కౌంటింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు కృష్ణ పర్యవేక్షణలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు పోలింగ్ కొనసాగించారు. మొత్తం ప్రక్రియను నిజమైన ఎన్నికలలాగే నిర్వహించారు. పోటీలో నిలిచిన విద్యార్థులకు గుర్తులు కేటాయించి పోలింగ్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులంతా ఓటు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో భూమారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండండి : బోథ్ సీఐ

బోథ్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): దురలవాట్లకు దూరంగా ఉండి మత్తుకు బానిస కావద్దని బోథ్ సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం సాయంత్రం మండలంలోని కనుగుట్ట గ్రామంలో గ్రామస్తులతో సమావేశమై పలు సూచనలు చేశారు. మత్తుకు బానిస అయితే ఆ కుటుంబానికి నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి తన కుటుంబాన్ని ఏ విధంగా ఉంచుకోవాలనేది గుర్తెరిగి తన బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. గంజాయి సాగుతో పాటు గంజాయి తాగితే తప్పని విషయాన్ని తెలుసుకోవాలన్నారు. సాగుచేసిన గంజాయి తాగిన కేసుల్లో ఇరుకుంటారన్నారు. ముఖ్యంగా యువత చెడు మార్గంలో పయనించకుండా తల్లిదండ్రులు పిల్లలకు సూచించాలన్నారు. ఆయన వెంట ఎస్సై శ్రీహరి పాల్గొన్నారు.

సప్తాహం వేడుకలు

కుభీర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్డి(బి) రాజరాజేశ్వర ఆలయ సప్తాహ వేడుకలు గురువారం భక్తి శ్రద్ధలతో వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రధాన వీదుల గుండా ఉత్సవమూర్తులను ప్లకిలో ఉంచి భక్తి గేయాలు సాంప్రదాయక భజనలు భక్తి సంకీర్తనతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ, గ్రామ కమిటీ నాయకులు మోహన్, తూం రాజేశ్వర్, పోశెట్టి, మాజీ సర్పంచ్ కండెల రాజన్న, సురేష్, బాబు, సంతోష్, నారాయణ, లక్ష్మీకాంత్, రాంచంధర్, పురోహితుడు దత్తాత్రి మహరాజ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతీక బోనాలు

దిలావర్‌పూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ అని ప్లేయర్ విద్యాలయం కరస్పాండెంట్ కేవీ నరసింహ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సిర్గాపూర్ ప్లేయర్ విద్యాలయంలో బోనల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ చరిత్రలో సజీవంగా నిలుస్తున్న పండుగ బోనాలు అని పేర్కొన్నారు. బోనం అంటే భోజనమని, ఇది మాతృదేవతకి ఇచ్చే నైవేద్యమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయికిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంబి : మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో బోనాల పండుగ గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఆట పాటలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పుప్పాల మల్లేష్ బోనాల పండుగ ఆవశ్యకత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పుప్పాల సుజాత, ప్రిన్సిపాల్ భూక్యా కైలాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కుభీర్ : మండలంలోని పల్సి గ్రామంలో గల విద్యాభారతి పాఠశాలలో గురువారం ఆషాడ మాసం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ పురంశెట్టి లింగయ్య మాట్లాడుతూ ఆషాడమాసం బోనాల ప్రత్యేకతను విద్యార్థులకు తెలియజేసేలా బోనాల పండుగను నిర్వహించమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పోతన్న, కరస్పాండెంట్ గంగాసింగ్, ఉపాధ్యాయులు సాయినాథ్, భోజన్న, ప్రవీణ్, రాజు, దేవకి, కవిత, రాణి, శ్రీవిద్య, నందిని, పద్మ, సరోజన, గంగామణి, సరస్వతీ, అస్మిత, నేహా, శృతిక, విద్యార్థిని, విద్యార్థులున్నారు.

'అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి'

పెంబి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల పైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు గురువారం పెంబి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై హనుమండ్లుకు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుతారి రమేష్, మల్లపల్లి స్వామి, బోరె రమేష్, ఖాన్, నాను, రమేష్, చారి, శేఖర్, తదితరులు ఉన్నారు.

ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు

నిర్మల్ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్పీహెచ్ఎస్ మంజులాపూర్ స్కూల్ పిల్లలను తీసుకెళ్లే ఆటోడ్రైవర్లకు, విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'లక్క సేకరణతో అదనపు ఆదాయం పొందండి'

బోథ్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): లక్క సేకరణ ద్వారా గిరిజనులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని బోథ్ రేంజ్ అధికారి పేర్కొన్నారు. గురువారం మండలంలోని జీడిపల్లి గ్రామంలో లక్క సేకరణ పై గ్రామస్తులు అవగాహన కలిగించారు. లక్క పోసిన మోదుగు చెట్ల కొమ్మలను తెప్పించి వాటిని ఏ విధంగా అంటగడితే లక్క ఉత్పత్తి అవుతుందా అనే విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు నాగోరావు, ముంతాజ్, బీట్ ఆఫీసర్లు రాజేశం, విఠల్, సంధ్యారాణి, అనిల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రవేశాలు అక్కడ.. తరగతులు ఇక్కడ!

(5వ పేజీ తరువాయి)

కోటా ఫ్యాకల్టి అంటూ తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారు.ఇంటర్మీడియట్‌తో పాటు ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ సెలబస్‌ను బోధిస్తామని నమ్మబలుకుతున్నారు.దీంతో ఇంటర్మీడియ ట్ ఫస్టియర్‌కే రూ.లక్షా 50వేల నుంచి రూ.2లక్షల వరకు ముక్కుపిండి మరి వసూలు చేస్తున్నారు. అలాగే పరీక్ష ఫీజులు, మెటీరియల్, డ్రెస్‌కోడ్ కోసం అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఇదంతా జిల్లా కే ంద్రంలోనే జరుగుతున్న సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తయిన చూడడం లేదంటున్నారు. క్షేత్ర స్థాయిలో ఇంటర్మీడియట్ అధికారులు పర్యవేక్షణ చేయక పోవడంతోనే ఇలాంటి అడ్డగోలుదందాలకు పాల్పడుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

స్వర్ణవాగులో పడి వ్యక్తి మృతి

నిర్మల్ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణ వాగులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కౌట్ల(కే) గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. కౌట్ల(కే) గ్రామానికి చెందిన తలారి పొట్టెన్న(65) పశువుల కాపరిగా ఉంటూ పశువులను స్వర్ణ వాగు దాటించి, వస్తుండగా నీటి లోతు ఎక్కువగా ఉండటం వల్ల నీటిలో మునిగి చనిపోయినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడి..

దిలావర్‌పూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కుడి చెరువులో ప్రమాదవశాత్తు బాలుడు పడి మృతి చెందిన ఘటన గ్రామస్థులను కలచి వేసింది. స్థానిక ఎస్సై రవీందర్ సింగ్, గ్రామస్థులు తెలిపినవివరాల ప్రకారం... దిలావర్‌పూర్‌మండల కేంద్రానికి చెందిన కొప్పుల రమణ, పద్మ దంపతులకు ఇద్దరు కొడుకులు. మృతుడు కొప్పుల అశ్వి త్(15) చిన్న కొడుకు కాగా అశ్విత్ అప్పుడప్పుడు మతిస్థిమితం కోల్పోయి ఊర్లో తిరుగుతుండేవాడు. అయితే బుధవారం మధ్యాహ్నం నుంచి అశ్విత్ కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు ఊరంతా వెతికినా ఆచూకీ లభించలేదు. రాత్రికి కూడా ఇంటికి రాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురైన తల్లిదండ్రులు బంధువులకు ఫోన్‌లు చేసి విచారించారు. గురువారం ఉదయం ఊరు పక్కనే ఉన్న కుడి చెరువులో మృత దేహం తేలి ఉండటాన్ని గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్సై రవీందర్ సింగ్ సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో మృత దేహాన్ని బయటకు తీయించారు. మృత దేహం అశ్విత్‌దే అని తేలడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తల్లి పద్మ అశ్విత్ రోదించారు. కాగా అవ్విత్ కాల కృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఊపిరాడక మృత్యువాత పడ్డట్టు భావిస్తున్నారు. అశ్విత్ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ సింగ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

దిలావర్‌పూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ - భైంసా జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సాపూర్(జి) మండలం తురాటి గ్రామానికి చెందిన కోమటి చిరు అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. తన ద్విచక్ర వాహనంపై నిర్మల్ నుంచి స్వగ్రామం తురాటి వెళ్తుండగా దిలావర్‌పూర్, న్యూ లోలం గ్రామాల మధ్య పల్లెటూరి దాబా సమీపంలో బైక్ అదుపు తప్పి కల్వర్టును బలంగా ఢీకొట్టాడు. బైక్‌తో సహ చిరు రోడ్డు కింద లోతైన కాలువలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు 108కు సమాచారం ఇచ్చారు. వెంటనే వచ్చిన అంబులెన్స్ సిబ్బంది గాయపడ్డ చిరును నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఆర్ఎంపీ క్లినిక్ సీజ్

లక్ష్మణచాంద, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్ మండలంలోని పలు క్లినిక్‌లను గురువారం సీజ్ చేశారు. ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంగించి చికిత్సలు అందిస్తున్న లక్ష్మణచాందలోని శాంతి క్లినిక్, వడ్యాల్‌లోని వాణి క్లినిక్, పరిమండల్‌లోని హారిక దవాఖానలను సీజ్ చేశారు. ఆర్ఎంపీలు యాంటీ బయోటిక్స్, ఇంజక్షన్స్, సెలైన్ బాటిల్స్, స్టిరాయిడ్స్ వాడకూడదన్నారు. వారి పేరు ముందర డాక్టర్ అని రాయకూడదని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 ప్రకారం చట్టపరంగా చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ సౌమ్య, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరిక

మామడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొరిటికల్ గ్రామం కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు మాజీ ఎంపీటీసీ డి. గంగన్న, మాజీ సర్పంచ్ మెరుగు రాజేశ్వర్, మాజీ వార్డు సభ్యులు ముత్తన్న, లింగన్న, ముత్యం, స్వామితో పాటు పలువురు కార్యకర్తలు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమక్షంలో గురువారం రోజున వారి నివాసంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్దిని చూసి బీజేపీలో చేరామని తెలిపారు. ఈ రోజుల్లో దేశం బాగుపడాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బాపురెడ్డి, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ఏలేటి చిన్న లింగారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చిన్నారెడ్డి, శ్రీకాంత్, రాజు, ముత్తన్న, రాజేశ్వర్, భీమ్ రెడ్డి, రాకేష్, రంజిత్ రెడ్డి, ఆనంద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

డయల్ 100 దుర్వినియోగంపై కేసు

నర్సాపూర్(జి), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర సేవల కోసం ఉద్దేశించిన డయల్ 100 నెంబర్‌ను దుర్వినియోగం చేసిన ఒక వ్యక్తిపై నర్సాపూర్(జి) పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీస్ స్టేషన్ నర్సాపూర్(జి) పరిధిలో బుధవారం రాత్రి కానిస్టేబుల్స్ కృష్ణ, మోహన్ పెట్రోకాల్ విధులు నిర్వహిస్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. రాత్రి సమయంలో నర్సాపూర్ నుంచి తక్కల మహేష్ అనే వ్యక్తి బాగా మద్యం సేవించి, ఏకంగా ఏడు సార్లు డయల్ 100కి కాల్ చేసి న్యూసెన్స్ సృష్టించాడు. దీంతో చర్యల తీసుకున్నారు.

సోనాల అంతర్గత రోడ్డుకు త్వరలో టెండర్లు

బోథ్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నూతన మండలమైన సోనాల మండల కేంద్రంలో అంతర్గత ప్రధాన రోడ్డు నిర్మాణానికి కోటి 80 లక్షల రూపాయలు మంజూరు కావడం జరిగిందని, చేపట్టేందుకు త్వరలో టెండర్లు పిలవడం జరుగుతుందని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. గతంలో ఈ రోడ్డు నిర్మాణం విషయమై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి స్థానిక శాసనసభ్యులు అనిల్ జాదవ్ విన్నవించడం జరిగిందన్నారు. అయితే స్పందించిన మంత్రి కోటి 80 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొంటూ ప్రొసీడింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో తమతో పాటు ఎమ్మెల్యే సంబంధిత శాఖ సిఈని కలిసి రోడ్డు విషయమై వివరించామన్నారు. త్వరలో టెండర్లు పిలవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ కళాశాల తనిఖీ

ముథోల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఇంటర్మీడియట్ బోర్డ్ జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9:30 గంటలకు కళాశాలకు చేరుకుని స్టాఫ్ మీటింగ్ నిర్వహించారు. అడ్మిషన్స్ సంఖ్య ఇంకా పెంచాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచుతూ నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అబ్దుల్ రహమాన్, అధ్యాపకులు గంగాధర్, అనిల్, ప్రశాంత్, గణేష్, నారాయణ, గోపాల్, శ్రీనివాస్, స్వరూప, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

కుంటాల, జూలై, 17 : (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా సహ చట్టం పరిరక్షణ కమిటీ అధ్యక్షులు సీహెచ్ వినోద్ కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సాజిద్ కుంటాల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సమాచార హక్కు చట్టం పుస్తకాలను డిప్యూటీ తహసీల్దార్ నరేష్ గౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు రావుఫ్ ఉన్నారు.



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుతున్న ఏజెన్సీలకు జరిమానా విధిస్తున్న దృశ్యం

నిషేధిత ప్లాస్టిక్ వాడకంపై అధికారుల తనిఖీలు

నిర్మల్‌రూరల్, జూలై17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హోటల్స్, కిరాణా షాపులు, ప్లాస్టిక్ ఏజెన్సీలలో నిషేధిత ప్లాస్టిక్ వాడకంపై పుర అధికారులు గురువారం తనిఖీలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. అపరిశుభ్రత ప్రమాణాలు కలిగి ఉన్న హోటల్స్‌కి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుతున్న ప్లాస్టిక్ ఏజెన్సీలు, కిరాణా షాపులను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వారు వినియోగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం పరుచుకొని సుమారుగా రూ. 4,500 జరిమానా విధించడంతోపాటు బట్టసంచులు వాడాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించాలి. లేనియెడల భారీ జరిమానాలు విధించడంతో పాటు దుకాణాలు సీజ్‌చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ ఉదయ్, జవాన్లు, సిబ్బంది ఉన్నారు.

ఖాళీలను ప్రకటించాలి

నిర్మల్‌రూరల్, జూలై17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాల, ఆశ్రమ బాలికల హాస్టల్‌లో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్ రెసిడెన్సీ టీచర్ పోస్టులు, సీఆర్ పీ ఎస్‌జీటీల ఖాళీల వివరాలు జిల్లాల వారీగా విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజేష్‌నాయక్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 33శాతం మహిలను సీఆర్‌టీలో తీసుకోవాలన్నారు. సమావేశంలో కార్యదర్శి క్రాంతి కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



అవసరమైన చోట అంగన్‌వాడీ కేంద్రాలు

ఇన్నాళ్లు తెలుగు మీడియంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు రాబోయే రోజుల్లో అనుకూలత, అవసరమైన చోట ఉర్దూ మీడియంలో కూడా ఈ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దమవుతోంది. దీనికోసం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను పంపాలంటూ అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది.

- ఉర్దూ మీడియం కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు
- అనుకూల ఏరియాల గుర్తింపు
- కొనసాగుతున్న క్షేత్రస్థాయి సర్వే
- మొదట పట్టణ ప్రాంతాలకు ప్రాధాన్యత

నిర్మల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాల మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారులు ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు కోసం క్షేత్రస్థాయి సర్వేను చేపట్టారు. జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో అక్కడ సిబ్బంది ఆధ్వర్యంలో ఇప్పటికే ఈ సర్వే కొనసాగుతోంది. ముఖ్యంగా అర్బన్ ప్రాంతాలలో ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయలని తలపెట్టారు. దీనికోసం గాను నిర్మల్ జిల్లా కేంద్రంతోపాటు భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల పరిధిలో మైనార్టీలు ఎక్కువగా నివసించే ఏరియాలను గుర్తిస్తున్నారు. ఈ ఏరియాలలో ఐదేళ్లలోపు ఉన్న పిల్లలు ఎంతమంది ఉన్నారనే అంశంపై ఆరా తీస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం పంపిన ప్రత్యేక ఫ్రొఫార్మాలో ఈ క్షేత్రస్థాయి సర్వేను కొనసాగిస్తున్నారు. సర్వే పూర్తికాగానే అనుకూలత, అవసరం ఉన్నచోట రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఉర్దూ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయబోతోంది. దీంతో ఈ కేంద్రాలలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. దీనికారణంగా రాష్ట్రంలో మరిన్ని అంగన్‌వాడీ కేంద్రాలు కొత్తగా ఏర్పాటవుతాయి.

కొత్త కేంద్రాల కోసం ప్రతిపాదనలు

ప్రస్తుతం ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు కోసం జరుపుతున్న సర్వే అనంతరం ఉమ్మడి జిల్లాలో అదనంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటయ్యే అవకాశాలు ఉంటాయి. ప్రస్తుతం నిర్మల్ జిల్లాలో 926 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. 100కు పైగా అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఖాళీగా ఉండగా 320 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇదిలా ఉండగా జిల్లాలో మరో 50నుంచి 100 వరకు కొత్తగా ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు కావచ్చని భావిస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో 969 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటితోపాటు ప్రస్తుత సర్వే ప్రకారం మరో 70 వరకు ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 1282 అంగన్‌వాడీకేంద్రాలు కొనసాగుతుండగా ఆ కేంద్రాల్లో 1192 మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ సుమారు 20కు పైగా ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు కానున్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. అలాగే కొమరం భీమ్, ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 1006 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతుండగా ఇక్కడ కూడా 60 నుండి 70 వరకు ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు కానున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ జిల్లాల్లో 159 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఖాళీగా ఉండగా 430 ఆయాల పోస్టులు వేకెన్సీ ఉన్నాయని ఆఫీసర్లు వెల్లడిస్తున్నారు. కగా ఈ జిల్లాలో 329 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. ప్రస్తుత సర్వే నివేదికల అనంతరం కొత్త కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన సంఖ్య స్పష్టంగా తేలనుంది.

మరిన్ని అదనపు సౌకర్యాలు

అంగన్‌వాడీ కేంద్రాలను అదనపు సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాలలో పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. అలాగే సొంత భవనాలు అంగన్‌వాడీ కేంద్రాలకు ఆకర్షిణీయ రంగులతో పెయింటింగ్ వేశారు. నిర్మల్ జిల్లాలో 926 అంగన్‌వాడీ కేంద్రాలకు 201 ప్రభుత్వ భవనాలలో 367 ప్రైవేట్ భవనాలలో కొనసాగుతుండగా 358 భవనాలు స్కూల్ బిల్డింగ్‌లలో కొనసాగుతున్నాయి. కాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవలే దాదాపు ప్రతీ మండలానికి రెండు చొప్పున అంగన్‌వాడీ భవనాలను కూడా నిర్మించారు. అంగన్‌వాడీలలో చదివే పిల్లలకు వారానికి రెండుసార్లు ఎగ్ బిర్యానీ తరహాలో కిచిడి భోజనం, కోడిగుడ్లు ఇతర పోషకాలున్న ఆహారాన్ని అందిస్తున్నారు. బాలామృతం పేరిట పోషకాలు ఉన్న ఆహారాన్ని అలాగే రాగి జావాను కూడా పిల్లలకు ఇస్తున్నారు. వీరితో పాటు గర్భిణీ స్ర్తీలు, యుక్త వయసు పిల్లలకు కూడా పోషకాహారంతో కూడిన సరుకులను పంపిణీ చేస్తున్నారు.

సర్వే జరుపుతున్నాం..

• ఫైజాన్ అహ్మద్, అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు)



ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు కోసం జిల్లాలో సర్వే జరుగుతోంది. ఉర్దూ మీడియం కేంద్రాల ఏర్పాటుకు అనుకూల ఏరియాలను గుర్తిస్తాం. క్షేత్రస్థాయిలో సర్వే జరిగిన తర్వాత మొదట పట్టణ ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నాం.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

సమస్యల పరిష్కారమే లక్ష్యం

• కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌టౌన్, జూలై17 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిలో కీలక అంశాలపై శాఖల మధ్య సమన్వయం అవసరమని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాదకద్రవ్యాల నిర్మూలన, బాల్య వివాహాల నివారణ, నకిలీ విత్తనాల అమ్మకాలు, స్కానింగ్ కేంద్రాల తనిఖీలు, రోడ్డు భద్రత అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, విత్తన దుకాణాల్లో నిరంతరం తనిఖీలు జరపాలని, రైతులకు నష్టం జరగకుండా తక్షణ స్పందనతో వ్యవహరించాలని సూచించారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ఇప్పటివరకు 32మంది బాల కార్మికులను గుర్తించగా, 19కేసులు నమోదయ్యాయని చెప్పారు. చిన్నారులను ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్చాలని, యజమానులపై కేసులు నమోదు చేసి వ్యాపార లైసెన్స్‌లు రద్దు చేయలన్నారు. ఈఏడాది 12 బాల్య వివాహాలు అడ్డుకున్నామని తెలిపారు. పాఠశాలల్లోని 72,876 మంది విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించామని చెప్పారు. ఆర్ఎంపీల చట్టవిరుద్ధ కార్యకలాపాలపై వైద్యాధికారులు దృష్టి సారించాలని, నిబంధనలకు విరుద్ధంగా చికిత్సలు చేసే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ చట్టం అమలులో ఇప్పటి వరకు 51 కేసులు నమోదు కాగా, 39 కేసులకు పరిహారం చెల్లించామని, 12కేసులు వివిధ దశల్లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. మాదక ద్రవ్యాల రహిత నిర్మల్ లక్ష్యంగా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, ఇప్పటివరకు 73 కేసులు నమోదు కాగా, 145మంది అరెస్ట్ అయ్యారని, 525 కేజీల 305 గ్రాముల గంజా సీజ్ చేశామని వెల్లడించారు. హైవే రూట్లపై ప్రమాదాలు జరగకుండా వేగ నియంత్రణ సూచికలు, హెచ్చరిక బోర్డులు, స్లో డౌన్ జోన్‌లను ఏర్పాటు చేయాలని, సూచించారు. ఎస్పీ జానకీ షర్మిల మాట్లాడుతూ బాల్య వివాహాల నియంత్రణలో సంక్షేమ, పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయన్నారు. చట్టంప్రకారం కేసులు నమోదు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాధిక, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

కళాశాలలో ఖాళీ పోస్టులను భర్తీ చేయండి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ముథోల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ముథోల్‌లోని గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీచేయాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డిని కోరారు. ముథోల్ గ్రామఅభివృద్ధి కమిటీసభ్యులతో కలిసి ఆయన ఛైర్మన్‌కు హైదరాబాద్‌లో గురువారం వినతిపత్రాన్ని అందించారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని, దానికి అనుగుణంగా లెక్చరర్, నాన్ టీచింగ్ ఉద్యోగాలను నియమించాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే వెంట గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు విఠల్, మున్నూరుకాపు సంఘం తాలూకా అధ్యక్షుడు రమేష్, మాజీ సర్పంచ్ అనిల్, నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

తురాటిలో కేంద్ర బృందం పర్యటన

నర్సాపూర్(జి), జూలై17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బృందం గురువారం నర్సాపూర్ మండలంలోని తురాటి గ్రామాన్ని సందర్శించింది. సెంట్రల్ టీం సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి గ్రామంలో పర్యటించి ప్రస్తుత పరిస్థితులను సమీక్షించారు. ఉపాధిహామీ, సదర్ అదర్శ గ్రామీణ యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, నేషనల్ పైప్ సిస్టం, డీఎన్ఆర్ఎల్ఎం వివిధ పథకాల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. పథకాల అమలు తీరు, వాటి వల్ల ప్రజలకు అందుతున్న ప్రయోజనాల గురించి అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల అభిప్రాయాలను, ఎదురవుతున్న సమస్యలను బృందం సభ్యులు శ్రద్ధగా విన్నారు. కార్యక్రమంలో ఏపీవో జగన్నాథ్, అసిస్టెంట్ రవీందర్, పంచాయతీ కార్యదర్శి రాజుతోపాటు పలువురు స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై పర్యవేక్షణ

కుంటాల: మండలంలోని ఓలాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గురువారం నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం సందర్శించింది. టీం సభ్యులు నారాయణ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఉపాధిహామీ, సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, నేషనల్ పెన్షన్ స్కీం, తదితర పథకాలపై లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పథకాలు అందుతున్న తీరు అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ ద్వారా చేపట్టిన పశువుల పాకలు, ఇంకుడు గుంతలు, హరిత హారంలో నాటిన మొక్కలు తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వనజ, ఏవో శ్రీనివాస్, ఎంపీవో రహీం, ఏపీవో నవీన్, ఏపీఎం అశోక్, టీఏ జైసింగ్, కార్తీర్, పంచాయతీ కార్యదర్శులు యోగేష్, ఫీల్డ్‌అసిస్టెంట్ తదితరులున్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

మామడ, జూలై17 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎక్సైజ్ సీఐ రంగస్వామి అన్నారు. గురువారం మామడ మండలంతో పాటు న్యూ లింగంపల్లి గ్రామంలో హరితహారంలో భాగంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటిన వాటిని సంరక్షించాలని కోరారు. పర్యావరణంతో రానున్న రోజుల్లో ఆరోగ్యం బాగుంటుందని, మొక్కలు పెంచాలని కోరారు. వన సంరక్షణతో ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడొద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై అభిషేక్, కొరిటికల్, లింగంపల్లి గౌడ సంఘం సభ్యులు, గ్రామస్థులు, సిబ్బంది ఉన్నారు.



ఈత మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ సిబ్బంది, గౌడ సభ్యులు

సాంకేతిక నైపుణ్యతను పెంపొందించుకోవాలి

• ఆర్జీయూకేటీ వైస్ చాన్సిలర్ గోవర్ధన్

బాసర, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వాటితోపాటు నాయకత్వలక్షణాలను డేటా ఆధారిత నిర్ణయాలపై దృష్టి సారించాలని బాసర ఆర్జీయూకేటీ వైస్ చాన్సిలర్ ప్రొ. గోవర్ధన్ అన్నారు. ఆర్జీయూకేటి వార్టన్ బిజినెస్ స్కూల్ యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా సంయుక్తంగా ఆర్గనైజేషన్ లీడర్షిప్ అండ్ ఇన్నోవేషన్ గేమ్, మిషన్ లెర్నింగ్, బిజినెస్ అనలిటిక్స్ ఇంటర్షిప్ నిర్వహించారు. 14 రోజులపాటు జరిగిన ఈ కోర్సు చివరిరోజు సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వీసీ మాట్లాడారు. 14 రోజుల పాటు సాగిన ఈ కోర్సులో విద్యార్థులు లీడర్షిప్, ఆర్గనైజేషన్, ఎథిక్స్, స్ట్రాటిజిక్ మార్కెటింగ్, మిషన్ లెర్నింగ్ మోడల్స్, బిజినెస్ అనలాటిక్స్, ఫ్రేంవర్క్‌లపై విద్యార్థులు పట్టు సాధించాలని కొనియాడారు. తయారీతో పాటు రియల్ టైం కేస్ స్టడీస్, సిమిలైజేషన్‌లతో విద్యార్థుల అంతదృష్టిని పెంపొదించేందుకు ఈ కార్యక్రమం దోహదపడిందని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఉత్తమప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులను అందించారు. కార్యక్రమంలో వీసీతో పాటు ఓఎస్డీ మురళీదర్శన్, కాకతీయ సాండ్‌బాక్స్ హెచ్ సాహితి తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న వైస్ చాన్సిలర్ ప్రొ.గోవర్ధన్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి

• అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌టౌన్, జూలై17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన వసతులు, ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు అనుకూలమైన, శుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని, పిల్లలు ఆనందంగా ఉండేలా కేంద్రాల్లో ఆకర్షిణీయమైన పెయింటింగ్స్, ఆట బొమ్మలు ఉండేలా చూడాలని సూచించారు. సరైన లైటింగ్, నాణ్యమైన, రుచికరమైన ఆహారం, శుభ్రత, పచ్చదనం వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. సమావేశంలో సీడీపీవోలు నాగమణి, నాగలక్ష్మి, సరిత, అంగన్‌వాడీల పర్యవేక్షకులు, అధికారులు పాల్గొన్నారు.

శివారు కాలనీల ప్రగతిపై ప్రత్యేక దృష్టి

• ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్

భైంసా, జూలై17 (ఆంధ్రజ్యోతి): భైంసాలోని శివారు కాలనీ ప్రాంతాల్లో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి, అవసరమైన ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ముథోల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణ రావ్ పాటిల్ పేర్కొన్నారు. గురువారం పట్టణ పరిధిలోని శివారుకాలనీలవాసులు మాజీ ఎమ్మెల్యేను భైంసాలోని క్యాంపు కార్యాలయంలో కలిసి తమ ప్రాంత సమస్యలు, మౌలిక వసతులు లేక పడుతున్న అవస్థలను వివరించారు. పట్టించుకునే వారు కరువై నిత్యం సమస్యలతోనే సహవాసం చేయాల్సి వస్తోందని వాపోయారు. మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ మాట్లాడుతూ శివారు ప్రాంతాల ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు. మున్సిపల్ అధికార యంత్రాంగం ద్వారా సమస్యల పరిష్కారం, అవసరమైన ప్రగతి పనుల కోసం ప్రతిపాదనలు రూపొందింప చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఇందులో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చందులాల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, కాంగ్రెస్ సోషల్ మీడియా ప్రతినిధి కాంబ్లే సాహేబ్‌రావ్ పాల్గొన్నారు.



కాలనీలవాసులతో మాట్లాడుతున్న ముథోల్ మాజీ ఎమ్మెల్యే

ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన

సోన్, జూలై17 (ఆంధ్రజ్యోతి): బాలశక్తిలో భాగంగా గురువారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం మాట్లాడుతూ విద్యార్థులంతా పాఠశాలస్థాయి నుంచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాకింగ్ వ్యవస్థను అర్థం చేసుకోవడం, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, పొదుపు, తదితర బ్యాంకింగ్ కార్యకలాపాలు అన్ని ఆర్థిక అక్షరాస్యత కిందికి వస్తాయన్నారు. బ్యాంకుల్లో ఉపయోగించే వివిధ రకాల ఫారములను గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల కుటుంబాల నిత్య జీవితంలో అవసరమగు పంట, విద్య, గృహ, వాహన, తదితర వివరాలను అర్థమయ్యేలా విద్యార్థులకు చెప్పారు. విద్యార్థులకు పొదుపుపై అవగాహన కల్పిస్తూ భవిష్యత్తు కోసం ఆర్థికంగా ఇప్పటి నుంచే స్థిరమైన ప్రణాళికతో సన్నద్ధంగా ఉండాలన్నారు. చిన్నచిన్న పొదుపులను అలవాటు చేసుకోవాలని సూచించారు. నేటి సాంకేతిక యుగంలో ఎన్నో ఆర్థిక నేరాలు జరుగుతున్నాయని వాటి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంక్ రుణాలు పొందుటలో కీలకపాత్ర వహించే సిబిల్ స్కోర్ విధానాన్ని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి గోవింద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నిర్మల్ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : వామపక్ష విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని గురువారం డీఈవో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నడుపుతున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, గుర్తింపు లేని పాఠశాలలను రద్దుచేయాలని తెలిపారు. అనంతరం డీఈవో ఆఫీస్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సింగరి వెంకటేష్, సీహెచ్ దిగంబర్, కైలాస్, శ్రీకాంత్, బబ్లు, సందీప్, నరేష్, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.



డీఈవో ఆఫీస్ ముందు ధర్నా చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు

బీసీ వసతి గృహంలో అధికారుల విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వార్డెన్ ప్రకాష్‌తో మాట్లాడుతున్న అధికారులు

ఖానాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మస్కాపూర్ బీసీవసతి గృహంలో గురువారం రాత్రి బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి బి. శ్రీనివాస్, ఏబీసీడబ్ల్యావో సత్యనారాయణరెడ్డి విచారణ చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో గురువారం 'హాస్టల్‌లో విద్యార్థులతో బోర్ మరమ్మతులు' శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించి ఆరాతీశారు. సంబంధిత ఘటనపై విద్యార్థుల నుంచి పూర్తి వివరాలు సేకరిస్తున్నామని పేర్కొన్నారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులకు తరగతులు ఉన్న పాఠశాల వేళల్లో ఇబ్బంది కలుగకుండా రాత్రివేళ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. విచారణ అనంతరం ఘటనపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి తర్వాత ఘటనకు కారకులైన వారిపై శాఖాపరమైన చర్యలు చేపతామన్నారు. హాస్టల్ వార్డెన్ ప్రకాష్‌ను సిబ్బందిని పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.